# అన్ని కోర్సులూ ఒకే చోట

ఒక్కో విద్యకు ఒక్కో వర్సిటీ వద్దు

భారీగా తగ్గనున్న విశ్వవిద్యాలయాలు

2020 నుంచి కొత్తగా అనుబంధ కళాశాలలకు అనుమతివ్వరు

జాతీయ నూతన విద్యా విధానంపై కస్తూరిరంగన్ కమిటీ ప్రతిపాదన



ఈనాడు, హైదరాబాద్: 'ఒకే రకమైన ప్రత్యేక కోర్సును బోధించే విద్యాసంస్థలను ఇక కొనసాగించరాదు. ప్రస్తుతం వైద్య, న్యాయ, వ్యవసాయ, సాంకేతిక తదితర కోర్సుల్లో ఏదో ఒకదాన్నే అందించే ప్రత్యేక విశ్వవిద్యాలయం లేదా కళాశాల ఉన్నాయి. వాటిని బహుళ కోర్సులు అందించే సంస్థలుగా మార్చాలి. వృత్తి విద్యతో పాటూ ఇక అన్ని రకాల కోర్సులూ ఒకేచోట ఉండాలి' అని జాతీయ నూతన విద్యావిధానంపై కస్తూరిరంగన్ ఛైర్మన్‌గా నియమించిన కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుతం అమెరికాతోపాటు పలు పాశ్చాత్య దేశాల్లో ఒకే వర్సిటీ లేదా కళాశాలలో పలు రకాల కోర్సులను అందిస్తున్నారు. అదే విధానాన్ని ఇక్కడా తీసుకురావాలని కమిటీ భావిస్తోంది. దీనివల్ల రెండు మూడు కోర్సుల విద్యార్థులు కలిసి పరిశోధన చేయడం వీలవుతుందని పేర్కొంది. ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను సృష్టించాలంటే భారీ, సమగ్ర వనరులున్న, బహుళ కోర్సులను అందించే సంస్థలను తయారు చేసుకోవాలని కమిటీ భావిస్తోంది. దీనివల్ల ప్రస్తుతం దేశంలోని 800 విశ్వవిద్యాలయాలు, 40 వేల కళాశాలలను కలిపి, సుమారు 15 వేల నాణ్యమైన విద్యాసంస్థలుగా మార్చుకోవాలన్నది కమిటీ ప్రతిపాదన. అంటే ఇప్పుడున్న విద్యాసంస్థల్లో 60 శాతానికిపైగా తగ్గుతాయి. దీనివల్ల చిన్న విద్యాసంస్థలు దాదాపు కనుమరుగవుతాయని కొందరు విద్యావేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 20% కళాశాలల్లో 100 మంది కంటే తక్కువ మంది విద్యార్థులున్నారు. దానివల్ల పూర్తిస్థాయిలో వనరులు సమకూర్చుకోలేకపోతున్నారు. ఫలితంగా నాణ్యమైన విద్య అందడంలేదని కమిటీ చెబుతోంది 'ప్రస్తుతం ఒక్కో ప్రత్యేక కోర్సుకు ఒక్కో నియంత్రణ సంస్థ ఉంది. ఆయా సంస్థల నిబంధనలు భిన్నంగా ఉన్నాయి. దీంతో ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావాలని కమిటీ ప్రతిపాదించింది. ఇక బహుళ

కోర్సులతో కూడిన విద్యాసంస్థలు ఉంటే మంచిదే. ప్రస్తుతం ప్రపంచం అదే దిశగా కదులుతోంది. ఇప్పటికే ఐఐటీ ఖరగ్‌పూర్ సైతం వైద్య విద్యను ప్రారంభించింది' అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆచార్యుడు రాజశేఖర్ అభిప్రాయపడ్డారు.

ప్రతిపాదనల్లో ముఖ్యాంశాలివీ..

* మూడు రకాల విద్యాసంస్థలుంటాయి. పరిశోధన విశ్వవిద్యాలయాలను టైప్-1, బోధనా వర్సిటీలను టైప్-2, బోధనా కళాశాలలను టైప్-3గా వర్గీకరిస్తారు. పరిశోధన, బోధనా వర్సిటీల్లో విద్యార్థుల సంఖ్య 5 వేల నుంచి 25 వేల వరకు ఉంటుంది. బోధనా కళాశాలలు డిగ్రీ కోర్సులపై దృష్టి కేంద్రీకరిస్తాయి. ఆ కళాశాలలు స్వయంప్రతిపత్తి హోదా దక్కించుకోవాల్సి ఉంటుంది.

* అనుబంధ కళాశాలలు ఇక ఉండవు. వర్సిటీలు లేదా డిగ్రీ పట్టాలిచ్చే కళాశాలలే ఉంటాయి. 2020 నుంచి కొత్తగా అనుబంధ కళాశాలలకు అనుమతి వ్వరు.

* ఇంటర్ విద్యార్హతతో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ప్రవేశపెట్టినా, రెండేళ్ల డిగ్రీ 2030 వరకు కొనసాగిస్తారు.

* భవిష్యత్తు న్యాయమూర్తులు, న్యాయవాదులను దృష్టిలో ఉంచుకొని న్యాయ విద్యను రెండు భాషల్లో అందించాలి. దీనివల్ల అనువాద సమస్యలు రావు.

* ఎంఫిల్ కోర్సును రద్దు చేస్తారు.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only.
To know more, please visit: www.freegurukul.org